క్లుప్తంగా

దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ

• టీడీపీ నేత నిర్వాకం



ఆదురుపల్లిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం ఆదురుపల్లి ప్రధాన రహదారి సమీపంలో స్థానిక టీడీపీ నాయకుడు ఏకంగా 30 అంకణాలకుపైగా ప్రభుత్వ స్థలాన్ని తన సోదరికి ప్రభుత్వాధికారులు ఎప్పుడో ఇచ్చారని చెప్పుకుంటూ ఆక్రమించాడు. దీనిపై గతంలోనే అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడ్రోజులు సెలవులు రావడంతో శని, ఆదివారాల్లో ఆక్రమిత ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని చేయించాడు. సర్వే నంబర్ 596లోని 31 అంకణాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇది నెల్లూరు – కలువాయి మార్గంలో పెట్రోలు బంకు సమీపంలో ఉంది. ప్రధాన రహదారిలోని స్థలం కావడంతో దీనివిలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అంచనా. కాగా సదరు టీడీపీ నాయకుడు మరో వ్యక్తికి దానిని విక్రయించినట్లు, దగ్గరుండి ప్రహరీ నిర్మాణం చేయించేందుకు పూనుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు దీనిపై సరైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై చేజర్ల మండల తహసీల్దార్ బి.మురళిని సంప్రదించగా ఆక్రమిత స్థలం గురించి తనకు ఇప్పుడే తెలిసిందని, సోమవారం వీఆర్వోను పంపి పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంలో గణేశ్ ఘాట్‌ను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సింగిల్ విండో పద్ధతిన అన్ని అనుమతులను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గణేశ్ ఉత్సవాలను సమైక్యంగా నిర్వహించేందుకు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటైందని, నెల్లూరు నుంచి బయ్యా వాసు ఉపాధ్యక్షుడిగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పిట్టి సత్య నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, మండ్ల ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్, ఫణిరాజు, మల్లికార్జున, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న రామన్న

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలో నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఏకైక సంఘం డీవైఎఫ్ఐ అని రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు రామన్న, రమణ పేర్కొన్నారు. బంగ్లాతోట సెంటర్‌లోని రత్నం భవనంలో ఆదివారం నిర్వహించిన డీవైఎఫ్ఐ నెల్లూరు నగర మహాసభలకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జగదీష్, నరసింహ, ట్రెజరర్‌గా శేఖర్, సహాయ కార్యదర్శిగా సురేంద్ర, ఉపాధ్యక్షుడిగా రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.


ఏపీఆర్ఎస్ఏ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నిక



నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఇందుకూరుపేట తహసీల్దార్ గోపీకృష్ణ, కార్యదర్శిగా నెల్లూరు రూరల్ డీటీ నాసర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా తోటపల్లిగూడూరు డీటీ శివయ్య, వైస్ ప్రెసిడెంట్ – 1, 2, 3గా బుచ్చిరెడ్డిపాళెం డీటీ భాగ్యలక్ష్మి, ఇందుకూరుపేట మండల సీనియర్ సహాయకుడు కొండలరావు, వెంకటాచలం మండల డీటీ విజయ్, జాయింట్ సెక్రటరీ – 1, 2, 3గా మల్లికార్జునరావు, పవన్, శ్రీనాథ్, కోశాధికారిగా జమీర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మురళి, హరిబాబు వ్యవహరించారు.

ఇక్కడంతా స్థానికేతరులే..

• ఇదీ పొదలకూరు ప్రత్యేకత
• వివిధ కారణాలతో వీధులకు పేర్లు
• చుట్టుపక్కల గ్రామస్తుల నివాసం
• మున్సిపాలిటీకి చేరువలో జనాభా



పొదలకూరు పట్టణ వ్యూ

పొదలకూరు పంచాయతీ	
జనాభా	: 17,662
ఓటర్లు	: 15,077
నివాసాలు	: 4,430

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరుకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఊరు స్థానికేతరులకు నెలవుగా మారింది. చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారే అధికంగా ఉన్నారు. దశాబ్దాల నుంచి స్థానికంగా ఉన్న కుటుంబాలు చాలా తక్కువ. శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో పొదలు అధికంగా ఉండటంతో పొదలకూరుకుగా గ్రామానికి నామకరణం చేశారని ప్రచారంలో ఉంది.

ఊరు మారిందిలా..

మహిమ కలిగిన వినాయకుడి గుడి, శివాలయం ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల్లో పొదలకూరుకు గుర్తింపు ఉంది. 200 సంవత్సరాల క్రితం ఊరు ప్రస్తుత మారుతీనగర్ ప్రాంతంలో ఉండేదని తెలుస్తోంది. అదే ప్రాంతంలో పెరుమాళ్ల స్వామి దేవస్థానం కూడా ఉండేది. అయితే అక్కడ వీరాంజనేయస్వామి ఉత్తరదిశ ముఖంతో ఉండటంతో ఊరును ఖాళీ చేసి మరో దిక్కులో ఏర్పాటు చేసుకోవాలని అప్పట్లో పెద్దలు సూచించారని, దీంతో రామందిరం ప్రాంతంలో పెరిగినట్టుగా చెబుతుంటారు. ఇప్పటికీ చాలావరకూ పట్టణంలోని ప్రధాన రహదారి, వీధులు గ్రామనత్తంలోనే ఉన్నాయి. పంచాయతీ బస్టాండ్ అప్పట్లో మందబయలు (గేదెలు తోలే ప్రదేశం)గా ఉండేది. మస్తాన్‌రెడ్డి నగర్ ప్రాంతంలో కుంట ఉండేది. అగచాట్లు పడి ఏర్పడిన వీధికి అగచాట్ల పురమని, బుడేసాహేబ్‌తో గుర్తింపు వచ్చిన వీధికి బుడేసాహెబ్ వీధి ప్రాంతమని, మగ్గం నేసే తొగటివారు ఉన్న ప్రాంతాన్ని తొగటి వీధి అని, చేనేత కార్మికులున్న ప్రాంతాన్ని దేవాంగ వీధి అని, బంగారు దుకాణాలున్న వీధిని రాజా వీధి అని పిలుస్తున్నారు. యాదవులు అధికంగా ఉన్న ప్రాంతానికి యాదవ వీధిగా నామకరణం చేశారు. మెయిన్‌రోడ్డులో ఉన్న దుకాణాలు బావి, కుంట పోరంబోకు భూములుగా చెలామణి అయ్యేవి.

స్థానికేతరుల స్థిర నివాసం

ఐదు శతాబ్దం క్రితం పొదలకూరు కేవలం 40 కుటుంబాలతో ఉండేది. వారంతా రామమందిరం ప్రాంతంలో నివాసం ఉండేవారు. ప్రస్తుతం ఉన్న రామనగర్‌గేటు సెంటరు ఉండేది కాదని తెలుస్తోంది. 40 కుటుంబాల్లో కూడా సుమారు 20 కుటుంబాల వారు బయటి ప్రాంతాల నుంచి పొదలకూరుకు వలస వచ్చిన వారే. ప్రస్తుతం 4,430 కుటుంబాలు, 17,662 జనాభా ఉన్న పొదలకూరులో తెలుగుగంగ ముంపువాసులు, కలువాయి, చేజర్ల, రాపూరు, సైదాపురం, మనుబోలు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీ (ఎమ్మార్వో కాలనీ) మిక్సిడ్ కాలనీగా గుర్తింపు పొందగా 600 నివాసాలున్నాయి. అక్కడ ఏ ఒక్క కుటుంబం వారు కూడా స్థానికులు కాకపోవడం విశేషం.

మారుతుందా?

పొదలకూరు పంచాయతీ మున్సిపాలిటీకి చేరువలో ఉంది. గతంలో పంచాయతీని మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే జనాభా కొంత మేర తగ్గడంతో అమలు కాలేదు. చుట్టుపక్కల గ్రామాలు, మైనర్ పంచాయతీలను కలిపితే మున్సిపాలిటీగా మారేందుకు అవకాశం ఉంది. కనీసం 25 వేల మంది జనాభా ఉండాలనే నిబంధన ఉన్నందున ఈసారి మున్సిపాలిటీగా మారుతుందనే అభిప్రాయం ఉంది.



పురాతన దేవాలయాలు



నాటి మందబయలు.. నేటి పంచాయతీ బస్టాండ్

చిరుజల్లులు.. ఆగి ఆగి కురుస్తూ..

పొదలకూరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై ఐదు నిమిషాలు వాన పడటం.. ఆగిపోవడం.. మళ్లీ మొదలవుతుండటంతో ఎలాంటి ఉపయోగం లేదని రైతులు అంటున్నారు. మోస్తరు వర్షం కురిస్తే మెట్ట పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. ఇప్పటి వరకు మెట్టపంటల సాగు జోలికి ఈ ప్రాంత రైతులు వెళ్లలేదు. వాన పడితే దుక్కిదున్నకం పనులు పూర్తి చేసి మినుము, పెసర చల్లుకునేందుకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన గౌస్‌బాషా పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి బయలుదేరగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గౌస్‌బాషా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

చందా ఇవ్వండయ్యా..

తోటపల్లిగూడూరు: వినాయకచవితి పండగ సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో విగ్రహాల ఏర్పాటుకు యువకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్నారులు చేపట్టిన చందాల వసూలు ప్రమాదాలను కొనితెస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా తాళ్లు కట్టి వాహనాలు నిలిపి డబ్బు వసూలు చేస్తున్నారు. తాళ్లను ప్రయాణికులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు.

కండలేరులో పెరుగుతున్న నీటి మట్టం



కండలేరు జలాశయం

పొదలకూరు: కండలేరులో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. సోమశిల ప్రాజెక్ట్ నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 8,100 క్యూసెక్కుల నీటిని జలాశయానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 27.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిలకు పైతట్టు నుంచి 24 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండటంతో కండలేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల 25 టీఎంసీలున్న కండలేరు జలాశయంలోకి సోమశిల నీటిని విడుదల చేయడంతో 2 టీఎంసీలు పెరిగింది. జలాశయంలో 35 టీఎంసీలు నీరు నిల్వ ఉంటే కండలేరు ఎడమగట్టు కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం రైతుల అవసరాల కోసం ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో గ్రావిటీ ద్వారా సాగునీటిని కాలువకు అందిస్తే తెలుగుగంగ అధికారులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం కండలేరు నుంచి సత్యసాయి కాలువకు 1,800, పిన్నేరుకు 20, లోలెవల్ స్లూయాజ్ ద్వారా 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతోంది. సోమశిల నుంచి వరద కాలువ ద్వారా నిత్యం 10 వేల క్యూసెక్కులు విడుదల చేయగలిగితే రోజుకు ఒక టీఎంసీ నీరు వచ్చి జలాశయంలో చేరుతుంది. అయితే సోమశిలకు పైతట్టు నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే కండలేరుకు నీటి విడుదలను పెంపొందించే అవకాశం ఉంటుంది. మొదటి బ్రాంచ్ కాలువ, ఎడమగట్టు కాలువ కింద కొందరు రైతులు ఎడగారు కింద వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చెప్పుకోదగిన స్థాయిలో నీటి అవసరాలు లేవని తెలుస్తోంది.

షాదీమంజిల్‌ను పట్టించుకునేవారేరీ..?

• వినియోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగం



కొడవలూరు: మండలంలోని గండవరంలో నిరుపయోగంగా ఉన్న షాదీమంజిల్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక్కడి షాదీమంజిల్‌తో పాటు కొడవలూరులోని షాదీమంజిల్‌ను ఒకే సమయంలో దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ రెండూ నిరుపయోగంగా మారాయి. అయితే కొడవలూరులోని షాదీమంజిల్‌ను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల సందర్శించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలంటూ రూ.పది లక్షలను మంజూరు చేశారు. అయితే గండవరంలోని షాదీ మంజిల్‌ను విస్మరించారు. దీన్ని వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది. దీని దుస్థితిపై గతంలో సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో వక్ఫ్ బోర్డు అధికారులు స్పందించి గండవరం షాదీ మంజిల్‌ను పరిశీలించి నివేదిక పంపాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై నివేదిక పంపినా, ఎలాంటి ప్రయోజనం లేకపోవడం గమనార్హం.

220 మందికి నేత్ర పరీక్షలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో 220 మంది పేదలకు నేత్ర పరీక్షలను చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆదివారం నిర్వహించారు. 60 మందికి కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సీఈఓ గల్లా కృష్ణ మాట్లాడారు. ఆపరేషన్లు అవసరమైన వారికి వెంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో త్వరలో ఉచితంగా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయుడు సు.దీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్భరంగా రహదారి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుచ్చిరెడ్డిపాళెం – రాజుపాళెం రోడ్డు వాగులా మారింది. ఈ మార్గంలో రాజుపాళెం ద్వారా కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వాహనాలు రాకపోకలను సాగిస్తుంటాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు, డీఎల్ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పరిస్థితి దారుణంగా మారింది. ఈ తరుణంలో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనచోదకులు అవస్థ పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



కలశాలను తెస్తున్న గ్రామస్తులు

మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామం దళితవాడలో మాతమ్మ కలశ స్థాపన, నూతన విగ్రహ శిఖర ప్రతిష్ట కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి – సుప్రియ దంపతులు పర్యవేక్షించారు.

ఎప్పటికి పూర్తవుతుందో?



మొండిగోడలతో దర్శనమిస్తున్న భవనం

పొదలకూరు: ఫైర్ స్టేషన్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అగ్నిమాపక కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తదాని నిర్మాణానికి దశాబ్ద కాలం క్రితం నిధులు మంజూరు చేశారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కొంత వరకు చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం తదితర కారణాల వల్ల పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి భవన నిర్మాణం పూర్తి కాక మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. తిరిగి పనులు చేపట్టేందుకు శాఖాపరమైన సమస్యలు ఏర్పడటంతో ఇప్పటి వరకు భవనం పూర్తి కాలేదు. పాత భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయపడుతున్నారు. శ్లాబ్ పెచ్చులుడి పడుతుండటంతో వారే దాతల సహకారం తీసుకుని మరమ్మతులు చేయించుకుంటున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు(టౌన్): బిట్రగుంట రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్లో 2003లో పదో తరగతి చదివిన వారు నగరంలోని మినర్వా గ్రాండ్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకొని నాటి స్మృతులను నెమరేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు.

23, 24న క్రీడా పోటీలు

నెల్లూరు(టౌన్): గ్రామీణ క్రీడాకారులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుచ్చిరెడ్డిపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో ఇషా ఫౌండేషన్ సౌజన్యంతో ఈనెల 23, 24న నిర్వహించనున్నామని సంస్థ వలంటీర్ మాధవ్ పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను బీవీనగర్‌లోని సంఘమిత్ర స్కూల్లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నామని, మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు పురస్కారాలను అందజేయనున్నామని తెలిపారు. వివరాలకు 94405 35032, 81796 71988 నంబర్లను సంప్రదించాలని సూచించారు. వలంటీర్లు మహేష్, గిరి పాల్గొన్నారు.

వామ్మో.. మందుబాబులు



మద్యం బాటిళ్లు

పొదలకూరు: చీకటి పడితే చాలు.. పట్టణానికి సమీపంలోని లేఅవుట్లలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. మోటార్‌బైక్‌లు, కార్లలో వెళ్లి మద్యం తాగుతున్నారు. పోలీసు పెట్రోలింగ్ లేకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. లేఅవుట్లలో నివాసముంటున్న వారు భయపడుతున్నారు. శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉన్నా లెక్కపెట్టడం లేదు. అలాగే నిమ్మమార్కెట్ యార్డుకు సమీపంలోని లేఅవుట్‌లో పగటి వేళల్లో కూడా బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. నెల్లూరు మార్గంలో ఉన్న లేఅవుట్లు అన్నింటిలో రాత్రి వేళల్లో తాగి వీరంగం చేస్తున్నారు. రియల్ భూమ్ సమయంలో పొదలకూరు పరిసర ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. కొన్నింట్లో ప్లాట్లు అమ్ముడుపోయినా ఇళ్లు నిర్మించలేదు. దీంతో అవి మందుబాబులకు నిలయంగా మారాయి. సమీపంలో ధాబాలు కూడా ఉండటం మద్యం ప్రియులకు అనుకూలంగా మారింది.

వ్యవసాయ కార్మిక సంఘ మహాసభ



కోవూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ కోవూరు మండల మహాసభను స్థానిక సీతాపోలయ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు మాట్లాడారు. కూలీలకు ఉపాధి పనులు సక్రమంగా లభించడంలేదని, పనిదినాలను పెంచడంతో పాటు వేతనాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలోని పల్లెల్లో మద్యం దుకాణాల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ వాటిని నిరోధించాలని నిర్ణయించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. నేతలు పెద్దబ్బయ్య, లీలమ్మ, కల్పన, రత్నమ్మ, కొమరగిరి శ్రీనయ్య, గోవర్ధన్, తన్నీరు శివ, పాటూరు చాన్‌బాషా, బుజ్జియ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు



మనుబోలు : గోపికల వేషధారణలో బాలికలు

మనుబోలు: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని శ్రీసిద్ధి విశ్వనాథ కూచిపూడి కళాక్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. బాలికలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో విచ్చేసి ఆకట్టుకున్నారు. కూచిపూడి నాట్యాచారిణి సుస్మిత నృత్య ప్రదర్శన జరిగింది.

• కొడవలూరు: మండలంలోని పద్మనాభసత్రంలో కృష్ణుడి ఊరేగింపు కార్యక్రమాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని గ్రామంలోని కూడలిలో కృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేశారు. జొన్నారెడ్డిగుంట, పల్లెపాళెం మీదుగా మండపం వరకు ఊరేగింపు సాగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సుందరరాజా, సభ్యులు రామలింగం, మల్లికార్జునరావు, రాజా సునీల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభసత్రంలో..